ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం 19 అక్టోబరు 2025




పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో బంద్ నిర్వహిస్తున్న దృశ్యం


ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నిరసన

బీసీ బంద్ సక్సెస్

- జిల్లాలో కదంతొక్కిన బీసీ సంఘాలు, పార్టీల నాయకులు
- ఉదయం వేళ డిపోలకే పరిమితమైన బస్సులు
- తెరుచుకోని దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలు, సినిమా హాళ్లు

కొత్తగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర బంద్ శనివారం భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో విజయవంతమైంది. కాంగ్రెస్, వామపక్ష, బీఆర్ఎస్‌తో పాటు పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ బంద్‌లో కదంతొక్కారు. ఉదయం నుంచే ఆర్టీసీ డిపోల వద్ద, ప్రధాన సెంటర్లలో రాస్తారోకోలు నిర్వహించడం, ర్యాలీలు తీశారు. అయితే బంద్ నేపథ్యంలో దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తెరుచుకోలేదు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ కోణంగా చూడకుండా వెనుకబాటు తనానికి గురైన బలహీన వర్గాలకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తగూడెంలో సీపీఐ,సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ అనుబంధ విద్యార్థి యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్, సమిదాన్ బచావో సభ్యులు జే.బీ శౌరి పాల్గొన్నారు. భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ బంద్‌కు మద్దతు తెలిపారు. మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఆళ్ల మురళి, తోట దేవీప్రసన్న తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన నిరసనలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవ పాల్గొన్నారు. సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. మైన్స్, డిపార్ట్‌మెంట్లు, కార్పోరేట్ కార్యాలయాల్లో పలు కార్యక్రమాలు జరగ్గా.. ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ కవితా నాయుడికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

అశ్వారావుపేట నియోజకవర్గంలో బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్ జరగ్గా.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లిలో నిరసనల్లో పాల్గొన్నారు. మణుగూరులో బీసీ సంఘం, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ,సీపీఎం, ఎన్డీ, బీజేపీతో పాటు పలు పార్టీల అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. బీటీపీఎస్ ఎదుట తెలంగాణ ఎలక్ట్రిసిటీ (మిగతా 8వ పేజీలో)


జూలూరుపాడులో రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు


కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


సత్తుపల్లిలో బీసీ బంద్ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

42 శాతం రిజర్వేషన్ సాధిస్తాం

- సామాజిక న్యాయమే రాహుల్ గాంధీ లక్ష్యం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సత్తుపల్లిలో 'బీసీ' బంద్‌కు హాజరు

సత్తుపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎవరు అడ్డం తిరిగినా పోరాడి.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని, సామాజిక న్యాయమే తమ నేత రాహుల్ గాంధీ లక్ష్యమని, అందులో భాగంగానే కులగణన చేయాలనేది ఆయన అభిమతమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ బీసీ రిజర్వేషన్లకు మోకాలడ్డుతోందంటూ, ఆ పార్టీ తీరుకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్త బీసీ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం సత్తుపల్లిలో జరిగిన బంద్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొని ప్రసంగించారు. దేశప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని, బీసీలకు రాజ్యాధికారంతో పాటు విద్య, ఉద్యోగావకాశాలు రావాలనే గొప్ప సామాజిక విప్లవం కోసం రాహుల్ గాంధీ గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని పొందుపరిచారన్నారు. కానీ దేశంలో కొద్ది తేడాతో అధికారంలోకి రాలేకపోయామని, అయినా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి ప్రజలు తీసుకొచ్చారని చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా ప్రక్రియను పూర్తి చేసి శాసన సభలో ఆమోదం తీసుకున్నారన్నారు. ఆ తర్వాత చట్ట బద్ధత ఇవ్వాల్సిన గవర్నర్, రాష్ట్రపతి వీటిని పట్టించుకోకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి (మిగతా 6వ పేజీలో)

వారికి వెలుగులేవీ?

- పీఆర్‌పీ కోసం మూడేళ్లుగా సింగరేణి అధికారుల ఎదురుచూపు
- ప్లేడేలు, పీహెచ్‌డీలు బహిష్కరించాలని నిర్ణయం

ఇల్లెందు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాలకు నల్లబంగారాన్ని అందిస్తూ.. పారిశ్రామిక రంగానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కాలరీస్‌లోని అధికారుల కుటుంబాల్లో దీపావళి వెలుగులు కరువయ్యాయి. 2022 నుంచి మూడు దఫాలుగా సింగరేణి యాజమాన్యం చెల్లించాల్సిన పర్మారెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లింపులు జరపకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో ఉత్పత్తి ఉత్పాదకల్లో అహర్నిశలు శ్రమిస్తూ సంస్థ లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమను యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్న ఆవేదన అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. కొద్ది నెలలుగా కోల్ ఇండియా అనుబంధ బొగ్గు గనుల్లో చెల్లించిన మాదిరిగా సింగరేణిలోనూ పీఆర్‌పి చెల్లించాలని సింగరేణి అధికారుల సంఘం (సీఎంవోఈఐ) దశల వారీ ఆందోళనలు వినతి పత్రాలు సమర్పించింది. సింగరేణి యాజమాన్యం ఇదిగో అదిగో అంటూ నెలల తరబడి జాప్యం చేస్తూ పీఆర్‌పీని పట్టించుకోకపోవడంతో అధికారులు ఏకంగా సింగరేణి బొగ్గు గనుల్లో ఓపెన్ కాస్ట్ గనుల్లో ప్లేడేలు, పీహెచ్‌డీలు బహిష్కరించాలని తీవ్ర నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. ఈ మేరకు సింగరేణి అధికారులు ఏకంగా రామగుండం -2వ డివిజన్ ఓపెన్ కాస్ట్-3లో తమకు పీఆర్‌పీ చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మూకుమ్మడిగా అధికారులు ప్లేడేలు, పీహెచ్‌డీలు బహిష్కరిస్తున్నట్టు యాజమాన్యానికి వినతి పత్రం అందించడం గమనార్హం. 2022-23 నుంచి 2024-25 వరకు మూడు పర్యాయాలు సింగరేణిలో అధికారులకు పీఆర్‌పీలు చెల్లించవలసి ఉంది. కానీ యాజమాన్యం ఇటీవల ఆందోళనలకు దిగిన సందర్భంలో త్వరలోనే చెల్లిస్తామంటూ హామీలు ఇచ్చి చేతులుదులుపుకొంది. కార్మికులకు దసరా పండుగలకు సింగరేణి లాభాల్లో వాటా చెల్లింపులు జరిపినా.. దీపావళికి బోనస్ చెల్లిస్తున్నా.. తమకు మాత్రం పీఆర్‌పీ చెల్లించకపోవడాన్ని సింగరేణి అధికారులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. తమపై యాజమాన్యం ఎందుకు వివక్షత చూపుతోందంటూ ప్రశ్నిస్తున్నారు. తమ హక్కులు కాలరాస్తుందంటూ నిరసనలకు దిగుతున్నారు. దసరాకు ముందే అధికారులకు పీఆర్‌పీ చెల్లిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా దీపావళి దాటుతున్నా యాజమాన్యం పీఆర్‌పీ ఊసే ఎత్తకపోవడంతో సింగరేణి అధికారులు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలన్న యోచనలో ఉన్నారు. కోల్ ఇండియా బొగ్గు గనుల్లో ఏటా అధికారులకు పీఆర్‌పీ చెల్లింపులు జరుగుతున్నా సింగరేణి లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పీఆర్‌పీ చెల్లింపులపై నిర్దిష్టంగా రాష్ట్ర ప్రభుత్వంగానీ సింగరేణి యాజమాన్యంగానీ ప్రకటించకపోవడాన్ని సింగరేణి అధికారులు ప్రశ్నిస్తున్నారు. రేపు మాపు అంటూనే సింగరేణి ఉన్నతాధికారులు పీఆర్‌పీని దాటవేస్తుండటం దసరా నుంచి పీఆర్‌పీ కోసం ఎదురుచూస్తున్న సింగరేణి అధికారుల కుటుంబాలు దీపావళికి సైతం అందకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ వాడకు దిక్కెవరు?

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొత్తగూడెం ఇండస్ట్రియల్ పార్క్
- అన్యాక్రాంతం అవుతున్న భూములు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

7


మూసివేసిన కిన్నెర స్టీల్ కర్మాగారం

ఆదికర్మయోగి అభియాన్ పనితీరులో

ఐటీడీఏ ఆదర్శం

- కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అందిన గుర్తింపు
- ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మ



కేంద్ర ప్రభుత్వం పంపిన గుర్తింపు పత్రం

భద్రాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆదికర్మయోగి అభియాన్ పథకం అమలు, పనితీరులో భద్రాచలం ఐటీడీఏ జాతీయస్థాయిలోనే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలో పథకం అమలుకు కృషి చేసిన విభాగాలను గుర్తిస్తూ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో గిరిజన సంక్షేమం, సాధికారత, సమగ్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ప్రదర్శించిన అంకితభావం, నిబద్ధతను అభినందిస్తూ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి విభునాయర్ భద్రాచలం ఐటీడీఏకు గుర్తింపు పత్రాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మ చేతులమీదుగా ఐటీడీఏ ఏవో సున్నం రాంబాబు అందుకున్నారు. రాష్ట్రంలో ఈ రీతిన అవార్డు అందుకున్న ఏకైక ఐటీడీఏ భద్రాచలం కావడం విశేషం. ఆదికర్మయోగి అభియాన్ పథకంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని మారుమూల 19మండలాల్లోని 130గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా గిరిజన సంక్షేమ శాఖ, విద్య, వైద్యశాఖలతో పాటు గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో వ్యవహరించాయి. ఈ పథకం కింద 2030 నాటికి 130 గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలను సమన్వయం చేయడం జరిగిందని పీవో రాహుల్ తెలిపారు. గ్రామాల్లో కావాల్సిన మౌలిక వసతుల కోసం 65అంశాల్లో రూ.1,341 కోట్లు ప్రతిపాదనలు తయారు చేసి పోర్టల్లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏకు ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని ఇందుకు బాధ్యతతో కృషి చేసిన ప్రతీ ఒక్కరిని అభినందిస్తున్నట్టు పీవో తెలిపారు.

'పేట'లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

సైనిక్, నర్సింగ్ స్కూల్ ఏర్పాటుకు ప్రయత్నాలు

అశ్వారావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గానికి మూడు ముఖ్యమైన విద్యాలయాలు రానున్నాయి. ఈ విద్యాలయాలన్నీ మంజూరైతే ఈ ప్రాంతం విద్యాహబ్‌గా మారనుంది. అశ్వారావుపేటలో రూ.200కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎట్టకేలకు అశ్వారావుపేటలోని పట్టువిత్తనోత్పత్తి కేంద్రం ఉన్న స్థలంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ పాఠశాల ఏర్పాటుకు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పరిశీలించినప్పటికీ అశ్వారావుపేటలోనే ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే టెండర్ల ప్రకియ ప్రారంభం కానున్నట్టు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 25ఎకరాలు అవసరమై ఉంది, అయితే పట్టు విత్తనోత్పత్తి కేంద్రంలో 17 ఎకరాల స్థలాన్ని పాఠశాల ఏర్పాటుకోసం అనుమతులు తీసుకున్నారు. కనీసం మరో 3 ఎకరాలు స్థలాన్ని పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో ముఖ్యమైన విద్యాలయం సైనిక్ పాఠశాలను అశ్వారావుపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాల పరిశీలన జరుగుతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సైనిక్ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా అశ్వారావుపేట మండలం, మద్దికొండ వద్ద నర్సింగ్ స్కూలును ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నర్సింగ్ పాఠశాలకు సంబంధించి ఫైల్‌ను ముఖ్యమంత్రికి అందజేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో రాష్ట్రంలోనే ప్రాధాన్యత కలిగిన అశ్వారావుపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూలు మరో విద్యాకలికితురాయిగా మారనుంది. అశ్వారావుపేట నియోజకవర్గం విద్యాహబ్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ప్రశ్నించగా ఇంటిగ్రేటెడ్ స్కూలు భవనాల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు ధ్రువీకరించారు. సైనిక్ స్కూలు, నర్సింగ్ స్కూలుకు అవసరమైన స్థలాలను గుర్తించామని త్వరలోనే ప్రజలకు శుభవార్త అందిస్తామన్నారు.


కొత్తగూడెంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

మద్యం దరఖాస్తులు.. 3,727

- అప్లికేషన్ల అందజేతకు ముగిసిన గడువు

చుంచుపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తమద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు ముగిసింది. చివరి రోజైన శనివారంతో కొత్తగూడెం జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తుదారులు బారులు తీశారు. 2025-27 కాలపరిమితికి లాటరీ ద్వారా మద్యం షాపుల లైసెన్సుల జారీకి గత నెల 26 నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వరకు 1,493మంది దరఖాస్తుల అందగా.. చివరి రోజున భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో ఈ సారి మొత్తం 3,727మంది దరఖాస్తులు అందజేసినట్టు అధికారులు తెలిపారు. ఇక ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఖమ్మం డివిజన్ ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ పర్యవేక్షించారు. అదేవిధంగా ఎక్సైజ్ డైరెక్టర్ షహనాజ్ ఖాసీమ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగంనుంచి ప్రత్యేకంగా ఒక ఎస్ఐను పంపారని, ఆయన దరఖాస్తుదారులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించినట్టు సమాచారం. ఇక ఈనెల 23న కొత్తగూడెం క్లబ్ వేదికగా లాటరీ ప్రక్రియ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి కె.జానయ్య తెలిపారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీలు అగ్రిమెంట్ చేయాలి: డీఏవో


మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

వైరా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విత్తన మొక్కజొన్న రైతులకు సంబంధిత కంపెనీలు విధిగా అగ్రిమెంట్ చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ స్పష్టం చేశారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరంలో శనివారం విత్తన మొక్కజొన్న రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విత్తన మొక్కజొన్న సాగుచేసే ప్రతి ఒక్కరూ కంపెనీ ఏజెంట్ల నుంచి విధిగా ఒప్పంద పత్రాలు తీసుకోవాలని ఆతర్వాతనే సాగుచేయాలని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్, ఏఈవో ఎం.రాజేష్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో బీజేపీ, కాంగ్రెస్ బాహాబాహీ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ బంద్ నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సత్తుపల్లిలో బాహాబాహీకి తలపడ్డారు. స్థానిక విద్యుత్ డీఈఈ కార్యాలయం సమీపంలో రిజర్వేషన్ల అంశంపై ఇరుపార్టీలు వాదోపవాదాలకు దిగాయి. తోపులాటలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించడంతో ఆందోళన సద్దుమణిగింది.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాణోతు విజయ్‌ను బీజేపీ నాయకులు పరామర్శించారు. అనంతరం ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ నాయకులపై కాంగ్రెస్ గూండాలు భౌతికదాడులకు దిగుతూ శాంతియుతంగా ఉన్న సత్తుపల్లి వాతావరణాన్ని అరాచకం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఈవీ.రమేష్, నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, పాలకొల్లు శ్రీను, నరేష్, మధుసూదన్, సాలి శివ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసినవారిపై చర్య తీసుకోవాలి

ఖమ్మంబైపాస్‌రోడ్: సత్తుపల్లిలో బీజేపీ అభివృద్ధి చెందుతుంటే అది చూసి ఓర్వలేక కొంతమంది కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులకు దిగుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. శనివారం బీజేపీ జిల్లాకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమవేశంలో పార్టీజిల్లాప్రధాన కార్యదర్శి గుత్తావెంకటేశ్వరరావు, ప్రవీన్‌ఖుమార్, జ్వాలా నర్సింహారావు, మందడపు సుబ్బారావు, ఏలూరి నాగేశ్వరరావు, నెల్లూరు బెనర్జి, రుంద్రగాని మాధవ్, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

రోగుల పట్ల సేవాభావం కలిగి ఉండాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


విద్యార్థులకు తెల్లకోటును అందిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :" వైద్య వృత్తి పవిత్రమైంది..., రోగుల పట్ల సేవా భావాన్ని కలిగి ఉండాలి... పేదలకు వైద్యులుదేవుడితో సమానమని" జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం మెదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోట్ సెర్మనీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో సీటు సాధించిన విద్యార్థులకు, అభినందనలు తెలిపారు. ప్రజలు వైద్యుల పట్ల అపార నమ్మకంతో తమ రోగాలకు చికిత్స చేయించుకునేందుకు వస్తారని, ప్రజలు వైద్యులను దైవ స్వరూపంగా చూస్తారని కలెక్టర్ అన్నారు. వైద్య వృత్తి ఎన్నుకున్న విద్యార్థులు అకాడమిక్స్ లో పట్టు సాధించడంతో పాటు మానవ శ్రేయస్సు కోసం ప్రయత్నించాలని, మన దగ్గర వచ్చే రోగులకు పేద, ధనిక భేదం లేకుండా చికిత్స అందించాలన్నారు. కోయంబత్తూర్ కు చెందిన అరవింద్ అనే ఆప్తమాలజిస్ట్ తన కెరీయర్ లో వేల మందికి చికిత్స అందించి కంటి చూపు కాపాడారని, అదే విధంగా ఇక్కడ ఉన్న వైద్యులు కూడా సేవా భావంతో ఉండాలన్నారు. వైద్య కోర్సులో ప్రాక్టికల్ పరిజ్ఞానం కోసం క్షేత్రస్థాయిలో పీహెచ్‌సీ లలో పని చేసేప్పుడు గ్రామీణ ప్రాంత రోగులకు విశేష సేవలు అందించాలన్నారు. విద్యార్థులు రీసెర్చ్ పై దృష్టి సారించాలని, ఫీల్డ్ విజిట్ లో స్థానికంగా ప్రజలు పడే బాధలు, వ్యాధులు, దానికి గల కారణాలను పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచనలు చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న ఒత్తిడిని తట్టుకుంటూ వైద్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు చెక్ లిస్ట్ ఎలా తయారు చేసుకోవాలి వంటి అంశాలు క్షుణ్ణంగా ఆలోచించాలన్నారు. వైద్యులు తాము చేస్తున్న వృత్తి పట్ల సంపూర్ణ పట్టు సాధిస్తే వృత్తి పట్ల అభిరుచి పెరుగుతుందన్నారు. వైద్యులు ఎప్పటి కప్పుడు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. ఐదేళ్ల ఎంబీబీఎస్ కోర్సు సమయంలో చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని, తల్లిదండ్రుల ఆశలను పిల్లలు నెరవేర్చాలని, ప్రతి ఒక్కరూ మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కలెక్టర్ వైట్ కోట్లు అందజేశారు. విద్యార్థులచే వైద్య వృత్తి నిబద్ధతతో నిర్వర్తిస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డాక్టర్ రాజేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాళ్ల డాక్టర్ సరిత, డాక్టర్. సృజన, డాక్టర్ వేణు, డాక్టర్. కిరణ్ కుమార్, డాక్టర్. రాంప్రసాద్, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచారహక్కు చట్టం కమిషనర్

ఖమ్మం కలెక్టరేట్: సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాసరావు శనివారంజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. కలెక్టర్ ఛాంబర్ లో ఆయనను కలిసి చట్టం అమలు, సమాచార హక్కు చట్టం నిబంధనలు 4(1)(బి), 6(1) లపై పౌర సమాచార అధికారులకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ, జిల్లాలో పెండింగ్ ఉన్న ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం మార్గం తదితర అంశాల పై కమీషనర్, కలెక్టర్ తో చర్చించారు.


సమాచారహక్కుచట్టం కమిషనర్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు బోనకల్‌లో భట్టి పర్యటన

బోనకల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనా షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ ప్రజా భవన్ నుంచి బయలు దేరి రోడ్డు మార్గాన బోనకల్‌కు 12 గంటలకు చేరుకుంటారు. అధికారులు, అనధికారులతో సమావేశం ఉంటుంది. అనంతరం లక్ష్మీపురంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండయా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాలను సందర్శించనున్నారు. అనంతరం ఇందిరా డెయిరీ లబ్ధిదారులతో ముచ్చటించనున్నారు. సాయంత్రం గ్రామాల్లో స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హైదరాబాద్‌కు పయనం కానున్నారు.

తుమ్మలకు పలువురి వినతులు

దమ్మపేట, అక్టోబరు 18 : మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలోని ఆయన నివాసంలో శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు కలిసి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పరిశీలించి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనవెంట కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, మన్నెం అప్పారావు, మంగేశ్వరరావు ఉన్నారు.

రైతు నేస్తం పురస్కారానికి ఎంపికైన ఆలపాటి



దమ్మపేట, అక్టోబరు 18 : మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్‌ను పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారానికి నూతన ఆవిష్కరణలు విభాగంలో ఎంపిక చేశారు. ఈపురస్కారాన్ని ఈనెల 26 న హైదరాబాద్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో రైతు నేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మురళి కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాదు, బండి బాస్కర్, మద్దినేని వెంకట్, కేవి సత్యనారాయణ, దొడ్డా ప్రసాదు, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, గుత్తా రాజా దొడ్డా చిన సత్యం, దొడ్డాభాస్కరరావు, బచ్చు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని సత్తుపల్లి డిపో నుంచి పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక డీఎం కార్యాలయంలో ఎంవీఐ జేఎన్.శ్రీనివాసరావుతో కలిసి పుణ్యక్షేత్రాల కరపత్రాలను విడుదల చేశారు. కార్తీక మాసం ముగిసేవరకు ప్రతి ఆదివారం రాత్రి 9గంటలకు సత్తుపల్లి నుంచి అన్నవరం, పంచారామాలకు డీలక్స్ బస్ బయల్దేరి కార్తీక సోమవారం నాటికి చేరుకుంటుందన్నారు. అన్నవరం పెద్దలకు రూ.570, పిల్లలకు రూ.330, పంచారామాలకు పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.770గా చార్జీలు నిర్ణయించినట్లు డీఎం తెలిపారు. అదేవిధంగా నవంబరు 4వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను నడిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఫ్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, సెక్యూరిటీ కానిస్టేబుల్ రాములు, వీటీఓ కిన్నెర ఆనందరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం, ఎంవీఐలు

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి

» కోల్‌మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న జాదవ్


మాట్లాడుతున్న కోల్ మూమెంట్ ఈడీ వెంకన్న జాదవ్

కొత్తగూడెం టౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి కోల్‌మూమెంట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ వెంకన్న జాదవ్ కోరారు. ఉత్పత్తి చేసిన బొగ్గును వెంటనే రవాణా చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సిహెచ్‌పి, వికె కోల్‌మైన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌సిహెచ్‌పిలో రైలు మార్గం ద్వారా రవాణా అవుతున్న బొగ్గు వివరాలను సంబంధిత జనరల్ మేనేజర్ షాలెం రాజును అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడంతో బొగ్గు రవాణాలో ఎలాంటి అంతరాయం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జనరల్ మేనేజర్ షాలెం రాజు, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణరాజు, సివిల్ ఏజీఎం రామకృష్ణ, వికె కోల్‌మైన్ ప్రాజెక్టు అధికారి ఎం. శ్రీ రమేష్, ఏజెంట్ రామ్ భరోస్ మహతో, మైన్ మేనేజర్ ఎంవి.ఎస్ శ్యాం ప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధిస్తాం

(5వ పేజీ తరువాయి)

అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో పోరాటం చేస్తోందన్నారు. చట్టసభల్లో ఆమోదం పొందిన బిల్లుకు సాంకేతిక కారణాలతో అడ్డం తిరుగుతున్నారని, ఎవరు అడ్డం పడినా ప్రజలంతా రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమించే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణలో జరిగిన కులగణన స్ఫూర్తితో తమ రాష్ట్రాల్లో కూడా కులగణ న చేయాలని ఆయా రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఏ రకంగా ముందుకు పోవాలనే అంశంపై ఈ నెల 23న జరగబోయే మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నామని స్పష్టం చేశారు. రెండేళ్ల ఆలస్యమైనా, కేంద్ర ప్రభుత్వ నిధులు రావని తెలిసినా చట్టపరంగా బీసీ రిజర్వేషన్ కోసం ముందుకు సాగితే వారి ఆశలను నట్టేట ముంచిన ఘనత బీజేపీదని విమర్శించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బీసీలంటే చిత్తశుద్ధి ఉందని, ఇచ్చిన మాట మేరకు కట్టుబడి ఉంటామని, మీరంతా బంద్‌కు పూర్తి మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్‌కోసం రాష్ట్ర ప్రభుత్వం కోర్టుల్లో పోరాడినప్పటికీ చుక్కెదురైందని, బీసీల వెన్నంటి ఉండే కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఉండాలని, రానున్న అన్ని ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో మద్దతు ఇచ్చినట్లు ప్రకటించే బీజేపీ కేంద్రంలో మాత్రం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీరు ఉందని, డబుల్ ఇంజిన్ సర్కార్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.


నిరసన ర్యాలీలో పాల్గొన్న మంత్రి తుమ్మల

కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, పాల్గొన్నారు.

చిరుతిండి.. అందేదెన్నడండి?

» పదోతరగతి విద్యార్థులకు అందని స్నాక్స్
» సెప్టెంబరు నుంచే అదనపు తరగతులు ప్రారంభం
» నవంబరు నుంచి అందిస్తామంటున్న హెచ్‌ఎంలు


ఓ పాఠశాలలో సాయంత్రం అదనపు తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో అందించాల్సిన చిరుతిండి (స్నాక్స్) ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి. స్నాక్స్ అందించాలని నిర్ణయించి నెల రోజులు గడిచినా అందుకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవటంతో విద్యార్థులు అర్థాకలితోనే అదనపు తరగతులకు హాజరువుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉదయం, మరికొన్ని పాఠశాలలో సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు పాఠశాలల్లో ఉండాల్సి రావటంతో కేవలం మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. సాయంత్రం అదనపు తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 6గంటల వరకు ఉండాల్సి వస్తోంది. వీరికి కేవలం మధ్యాహ్న భోజనం మాత్రమే అందుతోంది. అయితే నవంబరు 1 నుంచి రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహించాల్సి ఉన్న క్రమంలో వారికి స్నాక్స్ అందిస్తారో లేదో తెలియని పరిస్థితి. ఖమ్మం జిల్లాలోని 438 ప్రభుత్వ పాఠశాలల్లో 18,452 మంది పదోతరగతి విద్యార్థులకు చిరుతిండి(స్నాక్స్) అందించాల్సి ఉంది. అధిక పోషకాలు ఉండే చిరుతిండ్లను అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

● పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు సబ్జెక్టుల వారీగా బోధనలు సాగుతున్నాయి. బోధించిన పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే బడికి వచ్చే విద్యార్థులు అర్థాకలితో సాయంత్రం వరకు ప్రత్యేక తరగతుల్లో కూర్చోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం మినహా ఇంటి నుంచి వచ్చి, తిరిగి వెళ్లే వరకూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకాకపోవటం, స్నాక్స్ అందించటకపోవటంతో అదనపు తరగతులకు హజరయ్యే విద్యార్థులు నీరసించిపోతూ పాఠాలపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారని విద్యార్థి తల్లితండ్రులు వాపోతున్నారు. ఇకనైనా అదనపు తరగతులకు హజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందించాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

డ్రగ్స్‌ను నిరోధించడంలో ప్రజలు సహకరించాలి

ఏడీ అరవింద్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌ను నిరోధించడంలో ప్రజలు సహకరించాలని ఖమ్మం జిల్లా సహాయ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌కుమార్ తెలిపారు. జిల్లా కెమిస్టు, డ్రగిస్టు అసోసియేషన్ నేతలతో కలిసి శనివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాలు, నియంత్రిత ఔషధాల అక్రమంగా ఉపయోగించడం నేరమన్నారు. వీటి తయారీ విక్రయానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. అనధికారికంగా మత్తు మందులు అమ్మడం, నకిలీ, నాణ్యత లేని మందులు విక్రయించడం చట్టవిరుద్ధమని వీటిని అరికట్టడంలో ప్రజల సహకారం కీలకమని డాక్టర్ అరవింద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజలు మత్తుమందుల విక్రయాలను నిల్వలపై టోల్ ఫ్రీ నంబర్: 1800-599-6865 (ఉదయం 10:30సాయంత్రం5:00)లోగా సమాచారాన్ని ఇవ్వొచ్చన్నారు. నేరుగా జిల్లా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

ఖమ్మం జిల్లాలో మద్యం దరఖాస్తులు 4,043

అర్థరాత్రి వరకు కొనసాగిన స్వీకరణ ప్రక్రియ.. గతం కన్నా భారీగా తగ్గిన అప్లికేషన్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం దరఖాస్తుల ప్రక్రియ శనివారం ముగిసింది. చివరి రోజు కావడంతో అర్ధరాత్రి వరకు ఎక్సైజ్‌శాఖ అధికారులు ధరఖాస్తులు స్వీకరించారు. 2023లో జిల్లా వ్యాప్తంగా 7,207 దరఖాస్తులు రాగా ఇప్పుడు మాత్రం 4,043 దరఖాస్తులకే పరిమితమైంది. గత నోటిఫికేషన్ కంటే ఇప్పుడు దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం 1 స్టేషన్ మాత్రమే లక్ష్యానికి మించి ఆదాయం పొందింది. ఖమ్మం నగరంలో లిక్కర్ మార్టుల వ్యాపారం జోరుగా ఉండటంతో ఖమ్మం 1స్టేషన్ పరిదిలో దరఖాస్తులు సంఖ్య భారీగా పెరిగింది. 2023లో ఒక్కో దరఖాస్తు రుసుం రూ.2లక్షలు కాగా ఇప్పుడు రూ.3లక్షలు చేశారు. 2023లో ఖమ్మం 1టౌన్ స్టేషన్‌కు 1,747 దరఖాస్తులు రాగా ఆదాయం రూ.29.94కోట్లు వచ్చింది. ఇప్పుడు 1,169 దరఖాస్తులకు రూ.35.07కోట ఆదాయం వచ్చింది.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఎం

మధిర రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి వల్ల జిల్లాలో పత్తి, పెసర ఇతర పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. శనివారం మధిర మండలం మల్లారం గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను నాయకులతో కలిసి పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు, మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర, నాయకులు షేక్.ఉద్దండుసాహెబ్, మచ్చా అప్పారావు, గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల రాము, మచ్చా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్' సూచికలు.. తప్పుల తడకలు..



వేంసూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌పీల్డ్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా సూచిక బోర్డులు తప్పుల తడకగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన సూచిక బోర్డులో వేంసూరు తర్వాత ఆంధ్రాలోని విసన్నపేట ఊరిని ముద్రించాల్సి ఉంది. కానీ వేంసూరు నుంచి విసన్నపేట కుడివైపు వెళ్లాలని సూచిక బోర్డులో ముద్రించారు. దీంతో వాహనదారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

వ్యవసాయ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు : వ్య.కా.సం

తల్లాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులను పట్టించుకోవడంలేదని తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం స్థానిక దొడ్డా కృష్ణయ్యభవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మన్నేపల్లి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సంక్షేమపథకాలు అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం నల్లధనం తెచ్చి పేదల బతుకులు మారుస్తానని, జీరో ఖాతాలు తీసుకోవాలని మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుచేస్తామని చెప్పి మరిచిపోయిందన్నారు. ఇందిరమ్మ ఇంటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే మిగిలిందన్నారు ఈ సమావేశంలో వ్యకాసం తల్లాడ మండల కార్యదర్శి పులి కృష్ణయ్య, మండల కమిటీసభ్యులు చల్లానాగేశ్వరరావు, అనుమోలు కృష్ణయ్య, మేడి కృష్ణయ్య, పేరసాని లలిత, యల్లంకి లక్ష్మీకుమారి, పామర్తి సత్యం, కర్లకంటి శ్రీను, మన్నేపల్లి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, మేడి భిక్షం, సత్తేనపల్లి నరేష్, రైతుసంఘం మండల నాయకులు నల్లమోతు మోహన్ రావు పాల్గొన్నారు.

సీపీఐ శతజయంత్యుత్సవాలను జయప్రదం చేయండి

» ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సురేష్

కారేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు26న జరిగే సీపీఐ శత వసంతాల ఉత్సవాల బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు నిచ్చారు. శనివారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో పుచ్చకాయల శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన కారేపల్లి, కామేపల్లి మండలాలసంయుక్త కౌన్సిల్ సభ్యుల సమావేశంలో సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఏకైక జాతీయ రాజకీయ పార్టీ సీపీఐ మాత్రమేనని, సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలునిచ్చి.. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం మిలిటెంట్ పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, ఏపూరి లతదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, కారేపల్లి,కామేపల్లి మండల కార్యదర్శులు పాపిని సత్యానారాయణ, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉంగరాల సుధాకర్, పుచ్చకాయల వెంకటకృష్ణ, తాతా వెంకటేశ్వర్లు, దల్‌సింగ్, భూషయ్య, అప్పారావు,అనంతరామయ్య, పురం వెంకట్ వెంకటరెడ్డి, బండి శ్రీను, బాబు సింగ్ సలీం పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్

రూపాయికే సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజూ 2జీబీ డేటా

ఖమ్మం మామిళ్లగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :దీపావళి పండుగను పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ సంస్థ ఆఫర్ ప్రకటించింది. ఒక్క రూపాయికే సిమ్, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటాఅను అందిస్తోందని సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. శనివారం ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమ్ కార్డును ఉచితంగా అందించడంతో పాటు ఒక్క రూపాయికే రీచార్జి సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. 100ఎస్ఎంఎస్‌లు, అక్టోబరు 18 నుంచి ఈ ప్లాన్ నవంబరు 15 వరకు ఈ కొత్త ప్లాన్‌ను అందిస్తున్నామన్నారు. ఉంటుందన్నారు. ఇతర నెట్‌వర్క్‌లనుంచి పోర్టబిలిటీ కూడా వర్తిస్తుందన్నారు.కొత్త కస్టమర్లకు ఈ సిమ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లో సంప్రదించాలన్నారు.

ఈ వాడకు దిక్కెవరు?



నేలకొరిగిన శిలాఫలకం.. తుప్పు పట్టిన బోర్డు





ఆంధ్రజ్యోతి పరిశీలన

పిచ్చి చెట్ల మధ్య శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొత్తగూడెం ఇండస్ట్రియల్ పార్క్
- అన్యాక్రాంతం అవుతున్న భూములు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం పట్టణంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతం అశ్లీల కార్యకలాపాలతో పాటు భూ ఆక్రమణలకు, డంపింగ్ యార్డుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇండస్ట్రియల్ పార్క్‌లోని రోడ్లకు ఇరువైపులా చెత్తచెదారం, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ) పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పేరుతో సుమారు ఐదు, దశాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని కొత్తగూడెంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించానికి, మౌలిక సదుపాయాల కోసం ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ కిన్నెర స్టీల్ ఫ్యాక్టరీని నెలకొల్పి.. కొన్ని వందల మందికి ఉపాధి అవకాశం కల్పించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు ఈ ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లడంతో మూసివేశారు. ఈ ప్రాంతం భూ ఆక్రమణకు గురికాకుండా ఆ ఫ్యాక్టరీ చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అయినప్పటికీ కొంత స్థలం అన్యాక్రాంతం అయ్యింది. అలాగే ఇండస్ట్రీయల్ పార్కులో వాహనాలకు, గృహ నిర్మాణాలకు అవసరమైన నట్లు, బోల్టులు, ఐరన్ సామగ్రి కోసం, అట్ట పెట్టెల కోసం, ఇతర చిన్న పరిశ్రమల కోసం భూములు కేటాయించారు. కొంత మంది పరిశ్రమల యజమానులు తమ భూములను అమ్ముకున్నారు. మరి కొందరు ఇతరులకు లీజుకు ఇచ్చారు. మరికొందరు అద్దెలకు ఇచ్చుకున్నారు. ఈ పరిశ్రమకు సంబంధించిన అధికారుల అలసత్వం, ఇతర కారణాల వల్ల ఈ పార్కును పట్టించుకున్న నాథుడే లేడు. 2013-2014 సంవత్సరంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు సంస్థలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ. 131.40 లక్షల నిధులను మంజూరు చేసింది. 2014 జనవరి నెలలో అప్పటి శాసనసభ్యులు, ప్రస్తుత శాసనసభ్యుడైన కూనంనేని సాంబశివరావు రోడ్ల నిర్మాణానికి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకం వెనుకనే పారిశ్రామిక మౌలిక సదుపాయాల బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శిలాఫలకం పగిలి నేల మీద పడిపోగా.. బోర్డు మాత్రం తుప్పు పట్టింది. నాసిరకం రోడ్లు అస్తవ్యస్తంగా మారిపోయాయి. ప్రస్తుతం ఈ పారిశ్రామిక ప్రాంతంలో సిమెంట్, ఐరన్, అమ్మకాల దుకాణాలు, డెకరేషన్ సప్లై కేంద్రం, యాష్ బ్రిక్స్ తయారీ అమ్మకాలు, కార్పెంటర్ పనులు, సిమెంట్ దిమ్మెల నిర్మాణాలకు కేంద్రంగా మారింది. అప్పట్లో కట్టిన కొన్ని షెడ్లు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. ఈ ఇండస్ట్రీయల్ పార్కు పక్కనే ఉన్న బోడగుట్ట మట్టి తవ్వకాలకు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న స్థలం చెత్తచెదారాలకు డంపింగ్ యార్డ్‌గా మారింది. మరికొంత స్థలం ఆక్రమణకు గురైంది. పైరవీలు, అధికారుల అండదండలతో తమకు ఇష్టం వచ్చిన వారికి ఈ ప్రాంతంలో భూములు కేటాయించారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. పిచ్చిమొక్కలు, శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు.. వెరసి ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

ఈ ప్రాంతాన్ని పట్టించుకునే వారే లేరా ?

కోట్లాది రూపాయల విలువ చేసే ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. రెవెన్యూ శాఖ గానీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గానీ, పారిశ్రామిక అధికారులు గానీ పట్టించుకోకపోవడం వల్ల ఈ ప్రాంతం దిక్కులేనిదిగా మారింది. స్థానికంగా యాష్ బ్రిక్స్ అట్టల తయారీ, ఇతర పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం వల్ల అనేక అనారోగ్యపరమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్యాలయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉంది. ఎవరికైనా సమాచారం కావాలంటే ఖమ్మం వచ్చి తెలుసుకోవాలని సంబంధిత అధికారులు అనడం విడ్డూరంగా ఉంది. ఇకనైనా కోట్లాది రూపాయలు విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, బినామీ పేర్ల మీద, పైరవీలతో నడిచే పరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుద్యోగ యువతీ యువకులకు, వృత్తి నైపుణ్యం కలిగిన వారికి, నూతన పరిశ్రమల స్థాపన పట్ల ఆసక్తి ఉన్న వారికి ఇక్కడ స్థలాలను కేటాయించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి

ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వండి

సత్తుపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మెగా జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ప్రభావిత ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, అందువల్ల ఉద్యోగ అవకాశాల్లో స్థానికులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన సత్తుపల్లిలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. సింగరేణి కోసం భూములు కోల్పోయిన రైతులు, కాలుష్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలలో అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనకు సింగరేణి ముందుకు రావాలని పీఓలకు సూచించారు. అవసరమైతే హైదరాబాద్‌లో సీఎండీతో మాట్లాడి, పనులకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ.. ఈనెల 23,24,25తేదీలలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రీ ఇంటర్వ్యూ కోచింగ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ వెళ్లకుండానే సత్తుపల్లిలోనే 50కు పైగా కంపెనీల ద్వారా 3వేల కొలువులను సాధించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జేవీఆర్, కిష్టారం ఓసీల పీఓలు ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారిగా మాలతి

కొత్తగూడెం టౌన్,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లను నియమిస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు సంబంధించి లైజన్ ఆఫీసర్లను నియమించారు. సింగరేణి కొత్తగూడెం కార్పోరేట్ లైజన్ అధికారిగా డాక్టర్ కొమ్ము మాలతిని నియమించారు. రామగుండం ఏరియా లైజన్ ఆఫీసర్‌గా సౌదుమల్ల సంతోష్‌కుమార్, రామగుండం -3 లైజన్ ఆఫీసర్‌గా గడిపల్లి మహేష్, ఎస్టీపీసీ లైజన్ అధికారిగా జనగామ శ్రీనివాస్, మందమర్రి ఏరియా లైజన్ ఆఫీసర్‌గా చంద్రమౌళి, శ్రీరాంపూర్ ఏరియా లైజన్ ఆఫీసర్‌గా ఆనంద్ కుమార్, బెల్లంపల్లి ఏరియాకు లైజన్ ఆఫీసర్‌గా డి. ప్రశాంత్‌ను నియమించారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు నూతన లైజన్ అధికారులను నియమించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు తెలిపారు. లైజన్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు చేపట్టిన సింగరేణి ఛైర్మన్ ఎన్. బలరాం, డైరెక్టర్ పా గౌతం పోట్రు, డైరెక్టర్లు, ఎల్‌వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, తిరుమలరావు, జీఎంలు దుర్గం రాంచందర్, కవితా నాయుడు, డీజీఎం అజయ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో ఎస్సీఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు లైజన్ ఆఫీసర్లు కృషి చేయాలని కోరారు.



చికిత్స పొందుతూ
ఇంటర్ విద్యార్థి మృతి



సందీప్ (ఫైల్)

బోనకల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై పొదిలి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచం సందీప్(16) ఖమ్మంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత మళ్లీ కళాశాలకు వెళ్లేందుకు నిరాకరించాడు. చదువుకోవడం ఇష్టం లేక.. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో గడ్డి మందు కొనుగోలు చేసి తాగాడు. గమనించిన కుటుంబీకులు సందీప్‌ను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలందిస్తున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తరలించారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో శనివారం బూర్గంపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని బుడ్డగూడెం శివారులో గల కిన్నెరసాని వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై ప్రసాద్ హెచ్చరించారు.

మార్కెట్‌కు దీపావళి కళ

● పూజా సామగ్రి, బాణసంచా కొనేందుకు జనం బారులు

ఖమ్మంఖానాపురంహవేలి / కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అనగా మట్టి ప్రమిదలతో ఏర్పాటుచేసిన దీపపు కాంతుల వరుస. జగతిని జాగృతంచేసే చైతన్యదీప్తుల శోభావలి. ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపపు కాంతుల వేడుక. సోమవారం పండుగ కావడంతో.. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్‌లు శనివారం నుంచే కళకళలాడుతున్నాయి. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం, పెవిలియన్ గ్రౌండ్, ఖానాపురం తదితర ప్రాంతాలలో రోడ్ల వెంట వివిధ ఆకారాలతో, రంగులతో తయ్యారు చేసిన ప్రమిదలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కార్తీకమాసం, దీపావళి పండుగలకు భక్తులు ముందుగానే ప్రమిదలను కొనుగోళ్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా వస్త్ర దుకాణాలు, పూల మార్కెట్లు, పూజా సామగ్రి దుకాణాలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పండుగ సందడి నెలకొంది. ఇప్పటికే దీపావళి సందర్భంగా సింగరేణి సంస్థ ఉద్యోగులకు రూ. 1.03లక్షల లాభాల బోనస్‌ను ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఆయా ఉద్యోగులకు అర్హతను బట్టి శనివారం వారి వారి ఖాతాల్లో నగదును జమచేసినట్టు సమాచారం. దీంతో భద్రాద్రి జిల్లాలోని సింగరేణి ప్రాంతాలైన కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాల్లో పండుగ జోష్ కనిపిస్తోంది. అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో షెడ్‌లను ఏర్పాటుచేసి విక్రయదారులు టపాసులను అమ్ముతున్నారు. ఈ సందర్భంగా వివిన్న రూపాలలో లక్ష్మీదేవి ప్రతిమలు, రాధాకృష్ణుల బొమ్మలు, రంగురంగుల డిజైన్‌లతో ప్రమిదలను మార్కెట్‌లో ప్రదర్శించి విక్రయదారులు వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అలాగే మరమరాలు, పంచదార చిలుకలు, ప్రమిదలు, పూజా సామగ్రి, కొత్తబట్టల కొనుగోళ్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మార్కెట్‌లు దీపావళి కళను సంతరించుకున్నాయి.



ఖమ్మం మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి





కొత్తగూడెంలో దీపావళి సామాగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



రామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



న్యాయమూర్తిని కలిసిన దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు

భద్రాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా.. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీతాయారు ఆలయంలో వేద పండితులు హైకోర్టు న్యాయమూర్తికి వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరపున కండువా, శాలువ, ప్రసాదాన్ని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు అందజేశారు. అంతకు ముందు న్యాయమూర్తికి ఆలయ ప్రాశస్త్యాన్ని వైదిక సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, మణుగూరు న్యాయాధికారులు శివనాయక్, సూరిరెడ్డి, దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, రామాయణపారాయణదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి వినతిపత్రం అందజేసిన బార్ అసోసియేషన్

భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం భద్రాచలంలో ఒక అదనపు సెషన్స్ కోర్టు లేదా అసిస్టెంట్ సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయాలని, అలా కాని పక్షంలో కనీసం కొత్తగూడెంలోని కోర్టుల్లో ఒక దానిని భద్రాచలానికి తరలించాలని హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావును కోరింది. ఈ మేరకు బూర్గంపాడు మండలం సారపాక బీపీఎల్ అతిథి గృహంలో న్యాయమూర్తిని కలిసిన భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోట దేవదానం, పూసాల శ్రీనివాసాచారి, సీనియర్ న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, పసుపులేటి రాంబాబు, బి.రామకృష్ణ, వి.సురేష్‌లు పాల్గొన్నారు.

దమ్మపేట కోర్టులో సమస్యలు పరిష్కరించండి

అశ్వారావుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన దమ్మపేట కోర్టులో సమస్యలను, సిబ్బందిని నియమించాలని దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ కోరారు. శనివారం కొత్తగూడెంకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావును దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జికి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కొత్తగా ఏర్పాటైన దమ్మపేట కోర్టులో సౌకర్యాలు, సిబ్బంది అవసరం ఉందని, సరిపడా సిబ్బంది లేకపోవడంతో రోజువారీ కార్యక్రమాలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి శ్యామ్‌కుమార్, గొంది మురళి, లక్కినేని నరేంద్ర, సంజయ్, దుర్గాపతి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విలాసాల కోసం చోరీలు

- 17 ఏళ్ల వయసులో ఇంటినుంచి బయటకు రాక
- పలు దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు
- రూ.50లక్షలకు పైగా బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విలాసవంతంగా జీవించాలన్న ఆలోచనతో తన 17 ఏళ్ల వయసులో ఇంటి నుంచి బయటకు వచ్చి జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఖానాపురంహవేలి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతూ పోలీసులు శనివారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా వేటపాలెంకు చెందిన మిక్కిలి వంశీకృష్ణ అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. వారిని చూసి తన కారు(టీజీ07క్యూ7887)లో పక్కకు తిప్పుకుని పోయే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే కారును ఆపి అతడిని అదుపులోకి తీసుకుని విచారించినట్టు ఏసీపీ రమణమూర్తి తెలిపారు. 17 ఏళ్లవయస్సులో ఇంటి నుంచి బయటకు వచ్చిన వంశీకృష్ణ హైదరాబాద్‌కు వెళ్లాడని, అక్కడ కొంతకాలం ఓ జిరాక్స్ షాపులో పనిచేస్తూ వచ్చే డబ్బులతోజల్సాలు చేశావాడని తెలిపారు. ఆ డబ్బులు సరిపోకపోవడంతో ఎక్కువ సంపాదించాలని ఆలోచించి.. హైదరాబాదులోని ఎల్బీనగర్, సరూర్‌నగర్, ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, నార్సింగ్‌తో పాటు పలు ప్రాంతాలలో తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేసేవాడని తెలిపారు. ఈక్రమంలో ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు కూడా నమోదుకాగా.. జైలుకు కూడా వెళ్లి బయటకు వచ్చినట్టు ఏసీపీ తెలిపారు. బయటకు వచ్చిన తర్వాత కూడా జల్సాలకు అలవాటు పడి మళ్లీ పలు దొంగతనాలు చేసేవాడన్నారు. దొంగలించిన డబ్బులతో బెంగుళూరు, హైదరాబాద్, గోవా వంటి నగరాలలో ఫైవ్‌స్టార్ హోటళ్లలో విలాసవంతంగా గడిపేవాడని తెలిపారు. ఈవిషయం హైదరాబాద్ పోలీసులకు తెలియడంతో విజయవాడ, ఖమ్మం నగరాలకు వచ్చి చుట్టుపక్కల వివిధ ప్రాంతాలలో దొంగతనాలు చేశాడన్నారు. వంశీకృష్ణపై నగరంలోని ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్‌తో పాటు ఖమ్మంవన్,టు,త్రీటౌన్లలో ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, వైరా పోలీసుస్టేషన్లలో కేసులున్నాయని తెలిపారు. అదేవిధంగా వంశీకృష్ణ వద్ద నుంచి సుమారు రూ.50లక్షల చేసే బంగారు ఆభరణాలు రూ.15లక్షల విలువచేసే కారును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్టు ఏసీపీ రమణమూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు భానుప్రకాష్, బాలకృష్ణ, కరుణాకర్, మోహన్‌బాబు, ఎస్సై శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల మెరుగుకు చర్యలు

క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు చేస్తున్న సబ్ కలెక్టర్

భద్రాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలను అడిగి తెలుసుకొని వాటి ఏర్పాటుకు సత్వరం చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఈ కోవలోనే భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లోని పలు పాఠశాలలు, గురుకులాలను భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ సందర్శించారు. భద్రాచలం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సామగ్రిని అభ్యర్థించారు. దీంతో వెంటనే చర్యలు తీసుకోవాలని ఏవోను ఆదేశించారు. అలాగే జడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు విషయాన్ని పరిష్కరించాలని కోరగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, వంటశాల, వసతి గృహాలు, తాగునీరు సదుపాయాలు, మరుగుదొడ్లను పరిశీలించారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

సుజాతనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్పీ స్టేషన్‌లోని పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం వంటి అంశాలను పరిశీలించారు. ఆయుధాల భద్రత, రికార్డుల నిర్వహణ, పాత కేసుల దస్త్రావేజులను కూడా పరిశీలించారు. 2009-2016 మధ్య పాత కేసుల రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలతో మరింత ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు పరచాలని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు మరింత సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం. రమాదేవి, ఏఎస్సై బాబురావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కరకగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతునికి ముగ్గురు ఆడ పిల్లలు ఉండటం ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న వెంకటాపురం ఆదివాసీ యువత ఆధ్వర్యంలో దశదిన కర్మలకు శనివారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.6వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కొమరం రవి, పోలెబోయిన రామారావు, పోలెబోయిన వెంకటనారాయణ, చందా ప్రదీప్, పూనెం లక్ష్మణ్, వరుణ్, ప్రశాంత్, సోలం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ సంపూర్ణం


భద్రాచలం యుబీ రోడ్డులో దుకాణాలను మూసి వేసిన దృశ్యం


భద్రాచలం ఆర్టీసీ డిపోలో నిలిచిన బస్సులు


దమ్మపేటలో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన


అన్నపురెడ్డిపల్లిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


బంద్‌లో పాల్గొన్న బీఆర్ఎస్, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు


టేకులపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాలు, అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు



భద్రాచలంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్

ఇల్లెందు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గ వ్యాపితంగా బీసీ సామాజిక వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం బంద్ ప్రశాంతంగా సంపూర్ణంగా జరిగింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గార్ల, ఇల్లెందు మండలాల్లో జరిగిన బంద్‌ను పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని ఇల్లెందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండలాల్లో బంద్ విజయవంతమైంది. బంద్ సందర్భంగా ఇల్లెందు పట్టణంలో ఉదయం నుండి వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు బీసీ సంఘాల నాయకులు వీధుల్లో తిరుగుతూ ర్యాలీలు నిర్వహిస్తూ వర్తక వ్యాపార సంస్థలు, బ్యాంకులు, పెట్రోల్ బంక్‌లు మూసివేయించారు. బంద్‌కు బీసీ సంఘాల నాయకులు మడత వెంకట్‌గౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, సీపీఐ నాయకులు కె.సారయ్య, బందం నాగయ్య, టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ, బాలకృష్ణ, సీపీఎం నాయకులు అబ్దుల్ నబి, ఎన్డీ నాయకులు మధు, మల్లెల వెంకటేశ్వర్లు, వివిధ కుల సంఘాల నాయకులు నాయకత్వం వహించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం అందించాలని భావించిందని కానీ కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని ఆరోపించారు. బీసీల కుల గణన చట్టబద్ధంగా జరిగినప్పటికీ జనాబా ప్రాతిపదికన రిజర్వేషన్లు కలించకుండా అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు.

టేకులపల్లిలో..

బీసీ సంఘాల జేఏసీ శనివారం తలపెట్టిన బంద్‌కు మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థలు, వ్యాపారవర్గాలు, పెట్రోలు బంక్‌లు మూసివేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కులసంఘాల ఆధ్వర్యంలో టేకులపల్లిలోని బస్‌స్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్ పాల్గొని మద్దతు తెలిపారు.

కరకగూడెంలో...

కరకగూడెం ప్రధాన సెంటర్‌లోని రహదారిపై ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. రహదారిపై ఆందోళనతో వాహనాలు రహదారికి ఇరువైపు పెద్ద ఎత్తున నిలిచాయి. బందు నేపథ్యంలో కరకగూడెం ఎస్ఐ పీవీ ఎన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బీటీపీఎస్ ఎదుట...

మణుగూరు రూరల్ : బందు నేపథ్యంలో బీటీపీఎస్ ఎదుట తెలంగాణ ఎలక్ట్రిసిటీ బ్యాక్వర్డ్ క్లాసెస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ రీజినల్ అధ్యక్ష కార్యదర్శులు జి.ఐలయ్య, డి.శ్రావణ్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం, బీసీ లైజర్ ఆఫీసర్ కృష్ణకాంత్, రాకేష్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..



అశ్వారావుపేటలో బంద్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర బీసీ సంఘాల పిలుపుమేరకు శనివారం అశ్వారావుపేట నియోజకవర్గంలో బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లిలో బంద్ సందర్భంగా జరిగిన ర్యాలీలు, ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిందని, దానిని అమలు చేసే బాధ్యత కేంద్రంపై ఉందని, బీజేపీ నాయకులు రిజర్వేషన్ల అమలుకోసం కృషి చేయాలని డిమాండ్ చేశా రు. రిజర్వేషన్లు అమలు కోసం బీసీ సంఘాల పోరాటాలలో కాంగ్రెస్ పార్టీ కలసి వస్తుందని అన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పూర్తిగా దుకాణాలు, బ్యాంకులను బంద్ చేశారు. అశ్వారావుపేటలో ప్రదర్శన, రాస్తారోకోలు నిర్వహించారు. సినిమా థియేటర్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా మూసివేసారు. బీఆర్ ఎస్ పార్టీ నాయకులు సున్నం నాగమణి, యుఎస్ ప్రకాశరావు, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలతో పాటు వివిధ బీసీ సంఘాలు ఈ ధర్నాలో పాల్గొన్నాయి.

డిపోలకే పరిమితమైన బస్సులు..

జాతీయ రహదారిపై రాస్తారోకో

బస్సులు వెళ్లకుండా అడ్డుకున్న ఆందోళనకారులు

పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం, ప్రధాన రాజకీయ పక్షాలు, బీసీ ప్రజా సంఘాల నాయకులు

భద్రాచలం/కొత్తగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని, బీజేపీ వైఖరిని నిరసిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరగాలని ఆకాంక్షిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బీసీ బంద్ భద్రాచలంలో ప్రశాంతంగా విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి తెల్లవారుజాము నుంచి బస్సులు బయటకు వెళ్లకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. అలాగే విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో భద్రాచలం ఆర్టీసీ బస్టాండు ఎదుట కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, బీఆర్ఎస్‌లతో పాటు ప్రజాదళిత బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సైతం ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ నిర్లక్ష్య వైఖరితోనే బీసీ బిల్లుకు ఆమోదం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రాజకీయపక్షాలు, ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నా బీసీ బిల్లుకు మోక్షం కలగకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందన్నారు. అలాగే బీజేపీ నాయకులు సైతం బీసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉండగా బీసీ బంద్‌ను పురస్కరించుకొని పట్టణంలోని వ్యాపార సముదాయులు అన్ని మూసివేసారు. కాగా భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి మధ్యాహ్నం రెండు గంటల తరువాత బస్సు సర్వీసులు బయటకు వెళ్లడం ఆరంభమైంది. అప్పటి వరకు డిపో, బస్టాండు ప్రాంగణంలోనే బస్సులను నిలిపివేసారు.

కొత్తగూడెం : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో...

బీసీ రిజర్వేషన్ 42 శాతం తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో బందు నిర్వహించారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవ మాట్లాడుతూ చట్టబద్ధత లేకుండా బిల్లును తయారు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ కాదా అని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, మాజీ కౌన్సిలర్లు, జేఏసీ చైర్మన్ కొదమూరు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బీసీ సంఘాల ఆధ్వర్యంలో..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. మైన్స్, డిపార్ట్‌మెంట్లు, కార్పొరేట్ కార్యాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ కవితా నాయుడికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లకూరు రమేష్, హరిశంకర్, వేముల మురళి, ఎడవలి యాదగిరి, నాగరాజు, పితాంబరం, చింతకింద శ్రీనివాస్, వెంకటస్వామి, శంకర్, ప్రియాంక, లిఖిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో మూతపడ్డ బ్యాంకులు, విద్యాసంస్థలు..

బీసీ జేఏసీ పిలుపు మేరకు పాల్వంచ పట్టణ వ్యాప్తంగా వ్యాపార సముదాయాలను, బ్యాంకులను, విద్యాసంస్థలను బీసీ మద్దతుదారులు మూయించారు. వివిధ కుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు బీసీ బంద్‌కు తమ మద్దతు తెలపడంతో సామాన్య ప్రజలు సైతం బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలిపారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పాల్వంచ పోలీసులు భారీ ఎత్తున బలగాలను మోహరించి బందోబస్తు నిర్వహించారు.


బంద్‌లో పాల్గొన్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య


కేటీపీఎస్ సెంటర్‌లో కార్మికుల నిరసన


కరకగూడెంలో పోలీస్ పహారా

విత్తనాలు నాటిన సీడీపీవో జయలక్ష్మి


విత్తనాలు నాటుతున్న సీడీపీవో జయలక్ష్మి

కరకగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిగూడెం పంచాయతీ తాటిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీడీపీవో జయలక్ష్మి, ఎంపీడీవో కుమార్, ఎంపీవో మారుతి ఆధ్వర్యంలో విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా సీడీపీవో జయలక్ష్మి మాట్లాడుతూ.. మణుగూరు ప్రాజెక్టులోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా విత్తనాలను నాటుతున్నట్లు తెలిపారు. నాటి విత్తనాలను జాగ్రత్తగా పెంపొందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యాలయంలో కూరగాయాలు, ఆకు కూరలు కూడా విత్తనాలు నాటుకుని ఆ కూరలతో చిన్నారులకు వండి పెట్టుకునే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భద్రమ్మ, రాజమణి, అంగన్‌వాడీ టీచర్స్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేస్తాం

అసిస్టెంట్ కలెక్టర్ రూరల్ (ట్రైనీ) సౌరబ్ శర్మ


విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ

పాల్వంచ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూలాన ఉన్న కోయగట్టు విద్యార్థులకు శాశ్వత పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేస్తామని అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్‌శర్మ ఐఏఎస్ అన్నారు. శనివారం కోయగట్టు గ్రామాన్ని ఆయన సందర్శించారు. తాత్కాలికంగా నిర్వహిస్తున్న పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, కాంప్లెక్స్ సీఆర్పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల చోరీ ఘటనపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగదు చోరీ ఘటనపై శనివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ యాయతిరాజు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన గన్నవరపు రాజు శుక్రవారం స్థానిక ఎస్‌బీఐలో రూ.2.50లక్షలు డీడీ తీసెందుకు వచ్చాడు. మరికొంత నగదు అవసరం కావటంతో పక్కనే ఉన్న బ్యాంకు మిత్ర వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో తన దగ్గర ఉన్న రూ.2.50లక్షల నగదును తన ద్విచక్ర వాహనానికి తగిలించిన సంచిలో ఉంచాడు. ఇదే క్రమంలో రాజును అనుసరిస్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చాకచక్యంగా రూ.2.50లక్షల నగదును చోరీ చేశారు. బ్యాంకు మిత్ర వద్ద నగదు తీసుకుని తన బండి వద్దకు రాగా సంచిలో ఉంచిన నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు చోరీకి పాల్పడినట్లుగా గుర్తించారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాయతిరాజు వివరించారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌కు ఘన స్వాగతం



హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించిన బార్ అసోసియేషన్

కొత్తగూడెం లీగల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జె.శ్రీనివాస్‌రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి న్యాయస్థాన ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా న్యాయస్థాన భవనంలో సీసీ కెమెరా వ్యవస్థను ప్రారంభించారు. తరువాత జిల్లాబార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ నేతృత్వంలో బార్ అసోసియేషన్ తరఫున వివిధ అభ్యర్థనలతో కూడిన వినతిపత్రం హైకోర్టు న్యాయమూర్తికి సమర్పించారు. ఈసందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి బార్ అసోసియేషన్ ప్రతిపాదించిన అంశాలను శ్రద్ధగా విని, సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కోర్టు డ్యూటీ కానిస్టేబుల్స్‌కు ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. జిల్లా న్యాయవాదుల సంక్షేమం, కోర్టు మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు న్యాయసేవలు మరింత సమర్థవంతంగా అందించాలన్న బార్ అభిప్రాయాలను పూర్తిగా సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి సరిత, సీనియర్ సివిల్‌జడ్జి ఎం.రాజేందర్, కే.కిరణ్‌కుమార్, కె.కవిత, జూనియర్ సివిల్ జడ్జిలు, కె.సాయి, బి.రవికుమార్, వి.శివనాయక్, డి.కీర్తి చంద్రికారెడ్డి, బి.భవాని, కె.సూరెడ్డి, బార్ అసోసియేషన్ తరఫున ఉపాధ్యక్షుడు జే.గోపి కృష్ణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, కార్యవర్గ సభ్యులు ఉప్పు అరుణ్, అడపాల పార్వతి, మాలోత్ ప్రసాద్, కె.చిన్నికృష్ణతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వయో వృద్ధుడి కన్నుమూత


వీరయ్య(ఫైల్)

దుమ్ముగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల గ్రామపంచాయతీ పరిధి ఎల్ఎన్‌రావుపేటకు చెందిన వయోవృద్ధుడు, పూజారి పాణం వీరయ్య(108) శనివారం వృద్ధాప్య సమస్యలతో మృతిచెందారు. నడిగడ్డలోని కొర్రాజుల దేవర పూజావిధానంలో బోనం వండి నైవేద్యం అందించేవారు. రెండేళ్లకోసారి జరిగే కొర్రాజుల పండగను గిరిజన సంప్రదాయం ప్రకారం దగ్గరుండి జరిపించేవారు. వీరి అకాలమృతి పట్ల తెలుగుదేశం మండలాధ్యక్షుడు కొమరం దామోదరరావు సంతాపం తెలిపారు.

'బీసీ' బంద్ సక్సెస్

(5వ పేజీ తరువాయి)

బ్యాక్వర్డ్ క్లాసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి తెల్లవారుజాము నుంచి బస్సులు బయటకు వెళ్లకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్‌లతో పాటు ప్రజా దళిత బీసీ సంఘాల నాయకులు నిరసన నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇల్లెందులో జరిగిన నిరసన కార్యక్రమాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యవేక్షించారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల్లో ర్యాలీలు, నిరసనలు జరిగాయి. పాల్వంచ కేటీపీఎస్ సెంటర్‌లో తెలంగాణ విద్యుత్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జెన్కో ప్రెసిడెంట్ కొమరవెల్లి రవీందర్ ఆధ్వర్యంలో కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి వివిధ అసోసియేషన్లు, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి.

ముగిసిన పాల్వంచ జోనల్ గిరిజన క్రీడలు


బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు

పాల్వంచ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ ఆశ్రమ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన పాల్వంచ జోనల్ స్థాయి గిరిజన క్రీడలు శనివారం ముగిసాయి. ఈ క్రీడా పోటీల్లో 360 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రీడలతో పాటు అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్స్ వంటి క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు నవంబర్ రెండవ వారంలో జరగనున్న జిల్లాస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల పాఠశాల హెచ్ఎం. ఎన్.చందు, క్రీడల డివిజన్ ఏఎస్ఓ వెంకటనారాయణ, జోనల్ సెక్రటరీ, ఎస్.బాలసుబ్రహ్మణ్యం, పీడీఏ శ్రీనగేష్, కె.నరసయ్య, ఎం.రాంబాబు, టి.అంజయ్య, జి.రవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.